
"భావా, ఇవాళంటే మా నాన్న ఇలా తలవంచుకుని అన్నం తింటున్నాడు కానీ మా చిన్నప్పుడు మమ్మల్ని ఎంత బాధపెట్టాడో నీకు తెలుసు కదా!" అన్నం తింటున్న వాళ్ల నాన్న వంక కోపంగా చూస్తూ అన్నాడు సుమన్.

రాజేష్ ఆయన వంక చూశాడు. అభావంగా పప్పన్నం చిన్నచిన్న ముద్దలు తింటున్నాడు.

"అనకూడదు కాని చిన్నప్పుడు ఇంట్లో బాలనేరస్థుల్లా పెరిగాం రా! సినిమాలు షికార్లు ఎలాగూ ఉండేవి కావు. కనీసం ఇంట్లోనూ స్వేచ్ఛగా కదలనిచ్చేవాడు కాదు. మాట్లాడనిచ్చేవాడు కాదు. ఛ... ఈయన మా తండ్రి అని చెప్పుకోవడానికి..." మాట పూర్తి చేయకుండానే ముఖం పక్కకు తిప్పుకున్నాడు చిన్న బావ శేఖర్.

# పాపం మామయ్య...

ప్రతాప వెంకట సుబ్బారాయుడు



"అలా అయితే మేం ఆడపిల్లలం మాత్రం ఇంట్లో సుఖపడ్డామేమిటి? సాధారణంగా తండ్రికి ఆడపిల్లలంటే ఇష్టమన్నది జగద్విదితం. ఎందుకంటే మెట్టినింటి వాతావరణం ఎలా ఉంటుందో చెప్పలేం కాబట్టి నాలుగు రోజులు పుట్టింట్లోనన్నా సుఖపడతారని... కానీ ఈయన మమ్మల్ని హాస్టల్లో శాడిస్ట్ వార్డెన్లాగా పెంచాడు. ఇంకా నయం మమ్మల్ని కట్టుకున్న వాళ్లు మంచివాళ్లు కాబట్టి, కాస్త ఇప్పుడు ఊపిరి పీల్చుకుంటూన్నాం. లేకపోతే.. 'చీర కొంగుతో ముక్కు తుడుచుకుంది రమణి సుమన్ పెద్ద చెల్లెలు.

రాజేష్ వాళ్లమ్మ ఊళ్లో ఉంటుంది.

సుమన్ 'కొత్తిల్లు కట్టుకున్నాను, గృహప్రవేశానికి, సత్యనారాయణ వ్రతానికి రమ్మని' రాజేష్ వాళ్ల అమ్మనాన్నలను పిలిచాడు. దాంతో రాజేష్ వాళ్లమ్మ 'నాకు రావడానికి వీలుపడదురా, నువ్వక్కడే ఉంటావు కదా... తప్పకుండా వెళ్లిరా..' అని రాజేష్‌కు పురమాయించింది.

రాజేష్ వ్రతానికి వచ్చి భోజనం చేస్తున్న సమయంలో ఈ అపశ్రుతులు చోటుచేసుకున్నాయి.

ఆయన తల ఎత్తాడు. ముఖం ఎర్రగా ఉంది. కళ్లలోంచి నీళ్లు పొంగి పొర్లడానికి సిద్ధంగా ఉన్నట్టనిపించింది రాజేష్‌కు.

ఆయన త్వరత్వరగా మజ్జిగన్నం తిని లేచి బయటకు వెళ్లి అక్కడున్న పడక్కుర్చీలో కూర్చున్నాడు. రాజేష్‌కు అన్నం తినాలనిపించలేదు. సరిగా తినలేకపోయాడు.

పది నిముషాల తర్వాత రాజేష్ తినడం ముగించి బయట వసారాలోకి వచ్చాడు. అక్కడ కూర్చున్న మామయ్య వంక చూశాడు.

కళ్లు మూసుకుని కూర్చుని ఉన్నాడు. బహుశా నిద్రపోయే ప్రయత్నమేమో! డిస్టర్బ్ చేయకూడదనుకుని దూరంగా ఉన్న మరో కుర్చీలో కూర్చున్నాడు రాజేష్.

మావయ్యను ఆ స్థితిలో చూసిన రాజేష్‌కు మనసు కెలికినట్టుగా అయింది.

రాజేష్‌కు చిన్నప్పుడు తను వాళ్ల మామయ్య వాళ్లింటికెళ్లిన రోజులు గుర్తొచ్చాయి.

***

రాజేష్ వాళ్ల మామయ్య పేరు భానుమూర్తి.

ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు.

అప్పట్లో చాలీచాలని జీతాలతో, ఇంటి అవసరాలు తీర్చడానికి చాలా అవస్థలు పడేవారు సాధారణ ఉద్యోగులు. అందుచేత డబ్బు దగ్గర చాలాచాలా జాగ్రత్తగా ఉండేవాడు భానుమూర్తి. ఆకు కూరలమ్మి కొత్తిమీర కట్ట పావలా అన్నా, గంటసేపు బేరమాడి పదిపైసలకి తీసుకునేవాడు. ఇంట్లో నెలకి సరిపడా తెచ్చిన వెచ్చాలు నెలంతా రావలసిందే. మధ్యలో ఆయనకు తెలియకుండా ఏ కారణం చేతనైనా అయిపోతే

అత్తయ్యని నానా మాటలు అనేవాడు. ఎప్పుడన్నా పిల్లలు పొరబాటున అద్దం పగలగొట్టినా, ఏదైనా వస్తువు విరగ్గొట్టినా అందర్నీ నుంచో బెట్టి క్లాస్ తీసుకునేవాడు. కొట్టేవాడు. అలాగే పిల్లల చదువు విషయంలో ఎప్పుడూ రాజీపడేవాడు కాదు. పిల్లలందర్నీ దగ్గర కూర్చోబెట్టుకుని చక్కగా చదివించేవాడు. మార్కులు సరిగా రాకపోతే మాత్రం కొట్టేవాడు.

మామయ్యకి అప్పుడప్పుడూ ఆఫీసు పనిమీద వారం.. పది రోజుల క్యాంపులు పడేవి. అప్పుడు ఇక అత్తయ్యతో సహా అందరికీ ఆటవిడుపే. ఇల్లు కిష్కిందని తలపించేది.

రాజేష్ తల్లికి అన్నయ్యంటే అభిమానం. పెద్ద సంసారంతో తలమునకలవుతున్న ఆయనంటే జాలి. అందుకే సంవత్సరానికి రెండు మూడుసార్లు అన్నయ్య ఇంటికి వెళ్ళేది. తల్లితో కూడా వెళ్ళే రాజేష్ అప్పుడు మామయ్యని చూసేవాడు. తను సోషల్‌లో చదివిన హిట్లరు.. ఆయన పరిపాలన గుర్తుకొచ్చేవి.

> భానుమూర్తి ఆకు కూరలమ్మి కొత్తిమీర కట్ట పావలా అన్నా, గంటసేపు బేరమాడి పదిపైసలకి తీసుకునేవాడు. ఇంట్లో నెలకి సరిపడా తెచ్చిన వెచ్చాలు నెలంతా రావలసిందే. మధ్యలో ఆయనకు తెలియకుండా ఏ కారణం చేతనైనా అయిపోతే అత్తయ్యని నానా మాటలు అనేవాడు. ఎప్పుడన్నా పిల్లలు పొరబాటున అద్దం పగలగొట్టినా, ఏదైనా వస్తువు విరగ్గొట్టినా అందర్నీ నుంచో బెట్టి క్లాస్ తీసుకునేవాడు. కొట్టేవాడు.

***

సాయంత్రం నాలుగింటికి కాస్త కాఫీ తాగి ఇంటికి బయల్దేరడానికి బైక్ తీశాడు రాజేష్.

బండి చప్పుడు విని దిగ్గున లేచాడు భానుమూర్తి. "ఒరే రాజేష్ కాస్త నన్ను సెంటర్లో హోమియోపతి మందుల షాప్ దగ్గర దింపరా, మందులు కొనుక్కోవాలి" అన్నాడు.

"అలాగే మామయ్యా" అని తీసుకువెళ్ళి ఆయన్ని మందుల షాపు దగ్గర దింపాడు.

"రాజేష్, కాస్త నువ్వు కూడా నాతో ఈ పక్కగా ఉన్న బెంచి మీద కూర్చోరా.. కొద్దిగా మాట్లాడాలి" అన్నాడు.


రాజేష్ బండి పక్కగా పార్క్ చేసి వచ్చి ఆయన పక్కన కూర్చున్నాడు.

ఒక పది నిమిషాలు చాలా నింపాదిగా.. బరువుగా కదిలాయి.

"రాజేష్... చూశావుగా సుమన్ ఎలా మాట్లాడాడో... ఇది ఇవాళ మాత్రమే జరిగింది కాదురా. నేనూ, అత్తయ్యా పెద్దవాళ్లమయిపోయాం. ఊర్లో ఉండలేక ఇక్కడికి.. వాడి దగ్గర ఉండడానికి వచ్చినప్పటి నుంచి ఇలాగే సమయం దొరికినప్పుడల్లా వాడితో వంత పాడుతున్నారు. వాళ్లు నా పిల్లలే, బాధపడకూడదనుకుంటాను. మనసు సున్నితమైంది కదా... అది అప్పుడప్పుడు చెమర్చుతుంది. ఏం చేస్తాం చెప్పు?

అప్పట్లో నేను నియంతలా వ్యవహరించిన మాట వాస్తవమే! ఎందుకు? వాళ్ల బాగుకోసం కాదూ. నేను నాకొచ్చే జీతంతో ఇంటి అవసరాలు తీరుస్తూ, అయిదుగురు పిల్లల్ని పెంచి పెద్దజెయ్యడం ఎంత కష్టమో ఆలోచించు. ఆదా చేసిన డబ్బుతో నేను ఏనాడన్నా సుఖపడ్డానా? నాకు వక్కపలుకు వేసుకునే అలవాటు కూడా లేదని నీకు తెలుసు కదా! ఐదు కిలోమీటర్ల దూరాన ఉండే ఆఫీసుకు సైకిల్ మీద వెళ్లి వచ్చేవాడిని. బండి కొనుక్కోలేకనా? రూపాయి.. రూపాయి ఆదా చేస్తే ఎదుగుతున్న పిల్లల అక్కరలు తీరుతాయని, ప్రైవేట్ ఉద్యోగానికి గ్యారంటీ ఏముంటుంది? తుమ్మితే ఊడిపోయే ముక్కు అది. మనం ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా ఒక్కోసారి విపత్కర పరిస్థితులు ఎదురవుతాయి. అప్పుడేం చేయాలి? అందరం వీధినపడకూడదు కదా. అందుకే అంత జాగ్రత్త తీసుకునేవాడిని. ఉద్యోగమే కాకుండా రూపాయి వస్తుందంటే ఏ పనయినా చేసేవాడిని. దేవుడి దయవల్ల ముగ్గురు ఆడపిల్లలకి మంచి సంబంధాలు తెచ్చి పెళ్లి చేశాను. మగపిల్లలను వారు కోరిన చదువులు చదివించాను. రిటైరయ్యాక వచ్చిన డబ్బుతో కొడుకులిద్దరికీ ఈ సెంటర్లో స్థలాలు కొని ఇల్లు కట్టించాను. అప్పుడు అంత కఠిన క్రమశిక్షణతో పెంచాను కాబట్టే, ఈ రోజు ఇలా నా పిల్లలు దారితప్పకుండా ఆనందంగా ఉన్నారు. ఈ అసలు విషయాన్ని మర్చిపోయి కేవలం బాల్యంలో వాళ్లు గడిపిన రోజులే గుర్తుపెట్టుకుంటే ఎలా? ఇప్పుడు జీవితం వాళ్లది. ఎలా కావాలంటే అలా బతకొచ్చు. నా ప్రమేయం ఉండదు. అయినా సూటిపోటి మాటలతో నా మనసును గాయపరుస్తారేంట్రా? ఇంకా నేనెంత కాలం ఉంటాను. చెప్పు. అన్నట్టు ఈ మధ్య అత్తయ్య కూడా పిల్లలతో చేరి నావల్ల జీవితంలో సుఖపడిందేమీ లేదని ఈసడించుకుంటోంది. అదింకా గుండెని దొలిచేస్తోందిరా.. ఇంకా నేనెందుకు బతికున్నానో మరి? బాధ్యతలు తీరాక 'భగవంతుడా...ఇహ నన్ను తీసుకుపో' అనంగానే' వెళ్లిపోయే అవకాశం మనిషికుంటే ఎంత బావుండేదిరా? మీ అమ్మ నాన్నలు ఏమి అదృష్టం చేసుకున్నారో గాని ఆణిముత్యం లాంటి కొడుకువి నువ్వు పుట్టావురా... నా పిల్లల్లో కనీసం... కనీసం ఒక్కరన్నా నీ...లా పుట్టాల్సింది. వచ్చే జన్మలోనన్నా కన్నవాళ్ల ముందుజాగ్రత్తని... అభిమానాన్ని అర్థం చేసుకునే పిల్లలు పుట్టాలని కోరుకుంటున్నానురా. నా మనసులోని బాధను ఇంతసేపు పంచుకున్నందుకు.." అని చేతులెత్తి నమస్కరిస్తూ...

రాజేష్ పిలుస్తున్నా... వెనక్కి చూడకుండా ముందుకు కదలిపోయాడు భానుమూర్తి. మసగ్గా కనిపిస్తున్న ఆయన్ని చూస్తూ... కళ్లనీళ్లు తుడుచుకుంటూ బైక్ ఎక్కి స్టార్ట్ చేశాడు రాజేష్.



సెల్ నెం:
9393981918